కొడవటిగంటి కుటుంబరావు

# కళలు

## 1. కళల సామాజిక స్వభావం

సాహిత్యమూ, నాటకాలూ, సంగీతమూ, శిల్పమూ, చిత్రలేఖనమూ, నృత్యమూ, సినిమాలూ మొదలైనవి ఒక సమాజం తాలూకు సంస్కృతినుంచి ఉద్భవించి, ఆసంస్కృతికి కొలబద్దలుగా ఉండటమేగాక ఆ సమాజంయొక్క పురోగమనానికిగాని, తిరోగమనానికిగాని తోడ్పడతాయి.

ప్రస్తుత పరిస్థితిలో మన దేశము పై విషయాన్ని నిరూపించటం చాలాకష్టం ఎనిమిదోతరగతివిద్యార్థులు చిన్న పిల్లలకు రచనలనూ, రచనోత్సాహంగలవాళ్ళ ఊసుపోకకోసం రాసే కథలనూ, నవలలనూ, కారణాంతరాలవల్ల సినిమా చిత్రాలు చిత్రాలుతీసి అందులో జీన్స్ ధరించిన అమ్మాయిలనూ, ఇంట్లోకూడా సూట్‌తో టై వేసుకొని, హాట్ ధరించే అమ్మాయిల తండ్రులనూ, నైట్‌డ్రెస్‌తోగాని పడుకోని హీరోలనూ చిత్రించేనిర్మాతలనూ ప్రమాణంగా తీసుకునీ, వైరూప్య చిత్రకళలో ఓలలాడే చిత్రకారులనుచూసే, కళలను సామాజిక సంస్కృతితో ఎలాటి సంబంధంగాని ఉందని ఊహించడం చాలా కష్టం.

విదేశీయ, విజాతీయ కళలతో - సంస్కృతితో కాకపోవచ్చు - సంపర్కమూ, సొంత సంస్కృతి అనేది తనజాతికి ఉందనిగాని, ఉండాలనిగాని కళాకారుడికి తెలియకపోవటమూ, కళాపోషకులకు - అంటే డబ్బిచ్చేవాళ్ళకు-సంస్కృతి అనేది ఉన్నదనికూడా తెలియకపోవటమూ ఇలాటి వికృత కళలకు అవకాశం కలిగిస్తాయి.

ఇవి న్యాయంగా సామాజిక జీవితంనుంచి పుట్టినవి కావు. గనక సామాజిక సంస్కృతిని ఏవైపునుంచీ స్పృశించలేవు; అదే కారణంచేత ఆ సంస్కృతినిగాని, దాని ద్వారా సామాజిక జీవితాన్నిగాని మార్చలేవు.

అయితే ఇటువంటి కళలు సమాజస్థితిని ప్రతిబింబించవని చెప్పడానికి లేదు. ఎందుకంటే, ఇవి కళాకారులలోనూ, కళాస్వాదకులలోనూ గల సాంస్కృతిక బానిస తత్వాన్ని, నిర్వీర్యత్వాన్ని, అరాజకత్వాన్నీ చక్కగా వ్యక్తం చేస్తాయి,

## 2. కళాసృష్టి : వ్యక్తులపాత్ర

కళలను సృష్టించేవాళ్ళు వ్యక్తులు. గౌరవంతోనో, వెటకారానికో వాళ్ళను మనం కళాకారులంటాం. వీళ్ళు ఆకాశం నుంచి ఊడిపడరుగనకా, అనాదిగా వస్తున్న కళా సంప్రదాయాలతో ఏమాత్రమూ సంబంధం లేకుండా వీరు కళా వ్యాసంగం చెయ్యలేరు గనకా, వీరి కళలకు చలామణీ సమాజలో ఉండాలి గనకా, కళలవల్ల లాభనష్టాలు పొందేవాళ్ళూ, కళాకారులూకూడా సమాజ బంధితులుగనకా కళలకు సమాజంతో సన్నిహితమైన సంబంధం ఉండితీరాలి.

కళాకారుడు సనాతనిస్టు అనుకోండి. సంఘంలో సనాతన సంస్కృతిని ఆరాధించేవారే ఆ కళాకారుడికి బ్రహ్మరథం పడతారు. అలాగే తెలుగు సాహిత్యానికి ఒరవడి "మామ్" రచనలు అనుకుని రచనలు చేసినవారిని మామ్ సంస్కృతీ ప్రియులే ఆకాశానికెత్తారు.

నికరమైన జాతీయ సంస్కృతి లేనిచోటా, వర్గసంస్కారాలు భిన్నంగా ఉన్నచోటకూడా కళాకారుడికి సమాజంలో ఏదో ఒక విభాగంనుంచి గుర్తింపూ, ప్రోత్సాహమూ రావాలి. సమాజంలో ఏ విభాగానికీ, వర్గానికీ సంబంధించని కళలను సృష్టించ బూనుకున్నవాడు విఫలుడు కాకపోవటంతో పోక, వెర్రాసుపత్రికిపెళ్ళే ప్రమాదంకూడా ఉన్నది.

కళాకారుడి వ్యక్తిత్వమూ, స్వాతంత్ర్యమూ, వ్యక్తి అభిరుచీ మొదలైన మహత్తర విషయాలనుగురించి ఊకదంచేవారు ఈపైన పచ్చి నిజాన్ని విస్మరించరాదు.

## 3. కళలనుంచి కలిగే అనుభూతి

ఆటవికదశలో ఉన్న సమాజంలోకూడా కళలు సమిష్టి అనుభూతికి కారణాలవుతాయి. వ్యక్తులకు జీవితంలో అడుగడుగునా అనుభవాలు కలుగుతాయి. అపరిణీత, అల్పసంఖ్యాక సమాజాలలో ఈ వ్యష్టి అనుభవాలు సమిష్టి అనుభవాలు కావటానికి కళలు అంతగా అవసరంలేదు. అలాటి సమాజాలలో కళలు గత అనుభవాలను విస్మరించకుండా ఉంచటానికే సమిష్టి జీవితము సాంప్రదాయక పాత్ర నిర్వహించటానికీ మాత్రమే పనికివస్తాయి.

ఆర్థికంగా ఎదిగివచ్చిన పరిధిలో సమాజాలలో అనేక రకాల వ్యక్తుల అనుభవం సమిష్టి అనుభవం కావటానికి కళలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ పని వార్తలద్వారా జరగదా అనవచ్చు. జరగదు. యికవ్యవహారాలను సిర్లిప్తంగా తెలుసుకునేవరకే వార్తలు పనిచేస్తాయి. ఎక్కడో ఒకవిమానం కూలి వందమంది చస్తే, దూరాన ఉన్నవారిని లేదా దేశాంతరాలవారిని, ఆవార్త నిజంగా కదిలించదు. కళలు వార్తలను మాత్రమే అందించవు. విమానంకూలి కొందరు చావటం కథలోని సంఘటనే ఆయేపక్షంలో, ప్రియాణీకులలో కనీసం ఒకరిమృతి వారికుటుంబంయొక్క గతిమీద ఎలాంటిప్రభావం కలిగించినదీ కథ చెబుతుంది. వార్తలలో వ్యక్తులు పాత్రలు కారు, కథలో వ్యక్తులు పాత్రలు, అవికల్పితపాత్రలే అయినా సామాజిక దృక్పథంగలవాడికి అది నిజమైన వ్యక్తులకన్న నిజమైనవి.

వాస్తవ సమాజంలో ఎవడైనా సమస్తమూ కోల్పోయి అష్టకష్టాలకు గురిఅయితే, వాడికి సంబంధించినవాళ్ళూ, ఎరిగినవాళ్ళూ బాధపడతారు. కాని హరిశ్చంద్రుడిపాట్లు అనేక కోట్లమంది పంచుకోగలరు. జీవితసత్యాలు కళల ద్వారా సార్వజనీనమవుతాయి.

ఇంతేకాదు వాస్తవ జీవితంలో జరిగే అవాంఛనీయ పరిస్థితులకు మనుషులు "స్వేచ్ఛ"గా స్పందించారు. స్వార్థమో, సంఘమర్యాదో, వర్గతత్వమో వ్యక్తియొక్క భావ చైతన్యానికి అడ్డపడ్డాడు. తిండికి మాడుతున్న దరిద్రులను గురించి కథలలో చదివి సానుభూతి చూపటం తేలిక; డబ్బు ఇబ్బందిలో ఉన్న మిత్రుడైనా, సోదరుడైనాసరే వస్తుంటే చూడగానే కలిగేది సానుభూతికాదు, డబ్బు అడుగుతాడన్న భయం! అలాగే కోడలిని అత్తగారూ, మొగుడూ కలిసి చావ గొట్టుతుంటే "నీకు బుద్ధి ఉందా?" అని అడిగే ధైర్యం ఎంతమందికి ఉంటుంది? కాని కళలు ప్రతిబింబించే జీవిత వాస్తవికతకు అడ్డుగోడలుండవు. కమ్యూనిజం అన్నమాట వింటేనే వెర్రెత్తిపోయేవాళ్ళు "మా భూమి" నాటకం చూసి తన్మయత్వం చెందటం నాకు తెలుసు.

కాని, ఒకటి అడగవచ్చు. కళలు కలిగించే ఈ సుష్క చైతన్యం ఎవరిని ఉద్ధరిస్తుంది? దీనివల్ల లాభం ఏమిటి? ఇక్కడే ఉన్నది అసలు రహస్యం. జీవితంలో సామాజిక దురన్యాయాలకు వ్యక్తిగతంగా స్పందించేవాళ్ళు లేనిపోని చిక్కులు తెచ్చిపెట్టుకోవటం తప్ప ఏమీ సాధించలేరు. కళల ద్వారా కలిగే స్పందన సాముహికమైనది. దానివల్ల సద్యో ఫలితం లేకపోయినా, భావి సామూహిక చైతన్యానికి పునాది వేస్తుంది.

ఒక వర్గానికి సంబంధించిన సమస్యలేఅయినా జీవితం కలిగించే ప్రేరణతో అన్నివర్గాల్నీ ఏకం చెయ్యలేకపోవచ్చు. కాని వర్గకళలు చెయ్యగలుగుతాయి. అంతేకాదు, వర్గసాహిత్య ప్రభావం వర్గాన్ని దాటికూడా పోతూంది. భూస్వాములు రైతులకు చేసే ద్రోహం చిత్రించినట్టయితే ఆ చిత్రణ అచ్చంగా రైతులనే ప్రభావితులను చేస్తుందనుకోనవసరంలేదు. భూస్వాములలో కొందరైనా ప్రభావితులు కాకపోరు. అస్పృశ్యులపట్ల అగ్రవర్ణాలవారికి సానుభూతి కలగటానికి కళమాత్రమే ఉపయోగపడుతుంది, జీవితంకాదు. ఈసమస్యలను శాసనాలుకూడా కళల తోడ్పాటులేకుండా పరిష్కరించలేవు.

## 4. కళలలో చైతన్యం

కళలవల్ల సమాజంలో కలిగే చైతన్యం ఎంత ముఖ్యమైనదో, జీవితగతి ప్రభావంచేత కళలలో కలగవలసిన చైతన్యంకూడా అంత ముఖ్యమైనదే – అంతకన్న ముఖ్యమైనదికూడాను.

ఆటవిక సమాజాలు శతాబ్దాలతరబడి మారవు. కలహారి ఎడారిలలో ఇప్పటికీ ఆహారం ఏరుకునే పూర్వ శిలాయుగపు సమాజాలున్నాయి. ఆటవిక దశనుంచి బర్బర దశకు వచ్చిన సమాజాలలోకూడా మార్పు త్వరగారాదు. వచ్చే కొద్దిపాటి మార్పు అంతఃకారణాలు కొన్ని బహిః కారణాలవల్ల ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు మనది బర్బర సమాజం కాకపోయినాకూడా, మన వేషభాషలలోనూ, నాగరికతా సంస్కృతులలోనూ తెచ్చుకుంటున్న మార్పులు 90 శాతం బయటినుంచి అరువు తెచ్చుకున్నవే. కాని సామాన్య ప్రజల జీవితం చూసినట్టయితే ఉత్తరదేశవాసులకు పనికివచ్చే సూక్తులు తులసీదాసులోనూ, కబీర్‌దాసులోనూ, ఇంకా దొరుకుతాయి. అట్లాగే మనకు వెయ్యేళ్ళనాటి తెలుగు భారతం – రెండువేల ఏళ్ళనాటి సంస్కృత భారతం అనువాదం – ఇంకా మార్గదర్శకంగానే ఉంటున్నది. కాని వేగంగా సమాజ స్వరూప స్వభావాలు మారే దేశాలలో మూడు నాలుగు వందల ఏళ్ళనాటి సాహిత్యంలోకూడా వర్తమానానికి పనికివచ్చే ముక్కలు అట్టే లేకపోవచ్చు.

"పనికి వచ్చేది" అన్నమాట కళల విషయంలో అతి ముఖ్యం. సమాజంలో జరగబోయే మార్పుల విషయాలు కళలు దర్శించగలిగి ఉండాలి. కళల ఊహకూ, అవగాహనకూ, అందకుండా సమాజంలో జరిగే మార్పులు ప్రజలకృషికి అందకుండా జరిగినవే అనాలి. తాము సామాజికులుగా ఏ శక్తులచేత ప్రభావితులవుతున్నదీ వారికే తెలియదన్నమాట. అలాటి సమాజంలో కళలు క్రమంగా జీవితానికి వెనుకబడిపోతాయి. అటువంటి పరిస్థితిలో రెండురకాల పరిణామాలు కలగవచ్చు: ఒకటి కళలు జీవితానికి పదిఅడుగులు వెనుకగా, అసహాయంగా గడపవచ్చు; అవి కళాభూతాలు! లేదా రెండు జీవితందారి జీవితానిదీ, కళలదారి కళలదీ కావచ్చు.

రెండూ అవాంఛనీయమైన పరిణామాలే. ఎందుకంటే ఎంత ప్రాకృత సమాజంకూడా కళల అవసరంలేకుండా నడవలేదు, కాని కళలకూ, జీవితానికీ పరస్పరాలంబన కోల్పోయిన సమాజం, పైన ఎంత నాగరికంగా కనిపించినా, అది చచ్చిపోతున్న సమాజమే.

ఈ కారణంచేత, కళాకారులకు సామాజిక స్పృహ అత్యున్నతస్థాయిలో ఉండటం ఎంతో అవసరం. ఎనిమిదో క్లాసు కుర్రాళ్ళూ, సజ్జలు తిని, సజ్జలు రెట్టవేసేవాళ్ళూ, స్వజాతి సంస్కృతిమీద రోతా, పరసంస్కృతీ వ్యామోహమూ గలవాళ్ళూ, "మీకు కళలంటే ఏమిటో తెలీదు. మేం సినిమా గల్లాపెట్టెలవాళ్ళం" అనేవాళ్లూ ఎంత విజృంభించనియ్యండి, సమాజంయొక్క పురోగతి అసలైన కళాకారుల కృషిమీద ఆధారపడిఉన్నది.

"కళాస్వేచ్ఛ", "వ్యక్తిస్వాతంత్ర్యం". "కళాకారుడి ఉన్నత కళాభిరుచి" లాటి శుష్కపదాలు కళలనూ ఉద్ధరించవు, సమాజాన్నీ ఉద్ధరించవు. "యాదృచ్ఛికంగాకూడా ఉత్తమకళలు జీవితానుభవంనుంచి రావొచ్చు" అన్నది కుంటివాదం. జీవితానుభవం జీర్ణంకావటానికైనా సామాజిక తత్వం బోధపడాలి; లేకపోతే జీవితానుభవంఉన్న ప్రతివాడూ ఉత్తమ కళలు సృష్టించవచ్చు. మళ్లీ మాట్లాడితే అందరికీ జీవితానుభవం ఉన్నదిగనక కళలతో పనేలేదు. ఎవరిమటుకు వారే జీవితాన్ని కాచి, వడబోసి, కాఫీలాగ తాగెయ్యవచ్చు!

(తరువాయి 17వ పేజీలో చూడుడు)

[ 4 వ పేజీ నుండి ]

ఉన్నాయి. కేంద్ర సాహిత్యఅకాడెమీవారి పంపున "మాకియ వెల్లి" Prince తెలుగుచేశారు. ప్రఖ్యాతవస్తాదు కోడి రామమూర్తినాయుడుగారిపై ఈయన వ్రాసిన వ్యాసాన్ని ఆంధ్ర ప్రభుత్వం చిన్ని పుస్తక రూపంలో ప్రచురించింది.

ఆధునిక తెలుగు కవితారంగంపై, మిల్టన్ అలంకారాలపై, మహాకావ్య పఠనావసరంపై వివేకానందునిపై వీరు ఆంగ్లంలో ప్రసంగాలు చేశారు. సవ్యాంధ్ర సాహిత్యం సాగిస్తున్న గవేషణ, ఉపాధ్యాయుల ఘనత - పాత్ర అన్న అనేక అంశాలపై తెలుగులోకూడా వీరి ప్రసంగాలు ప్రసారం అయ్యాయి. లాటిన్, గ్రీకు, సంస్కృతం సూక్తులతోకూడి రసభరితంగా సాగే వీరి ప్రసంగం వినడం అదొక గొప్ప అనుభవం. తాను నేర్చిన అన్ని విదేశీ భాషలనూ ఆయా భాషల మౌలిక ఉచ్చారణారీతిలోనే వీరు చదవడం ప్రత్యేకంగా పేర్కొనదగిన అంశం. వీరు సంస్కృత శ్లోకాలు సుశ్రావ్యంగా చదివే తీరు అవశ్య అనుసరణీయం.

తెలుగు వ్యాసాలూ, గ్రంధ పీఠికలూ, రేడియో ప్రసంగాలూ ఒక సంపుటిగానూ, ఆంగ్లానువాద కవితలొక సంపుటిగానూ, ఆంగ్లవ్యాసాలను మరొక సంపుటిగానూ తగిన రీతిలో అచ్చువేయించి సాహిత్యలోకలోకి తెస్తే అందువల్ల ఎంతయినా మేలు జరుగుతుంది. అనేక ప్రపంచ భాషలు పఠించిన సమగ్రదృక్పథంతో ఆయనచేసిన సాహిత్య విమర్శ, కవితా సిద్ధాంత చర్చ - విద్యార్థులకు సహృదయులకు ఎంతో ఉపకారి అవుతుంది. శ్రీ మానేపల్లి సత్యనారాయణ ఈపనికి పూనుకుని విషయ సేకరణ చేస్తున్నారు. ప్రచురణ కర్తలు, ముందుకువస్తే అవిసంపుటాలుగాప్రచురింపబడొచ్చు

ధనకాంక్ష మాత్రమేకాదు. కీర్తికండూతి కూడా ఏమాత్రమూ లేని వ్యక్తి ఆచార్య రోణంకి. సుకవితా రాజ్యైనకమ్-అన్న రీతిగా వారికి సుకవితా సామ్రాజ్య మే సర్వస్వమున్నూ. వీరికి కలంపట్టి రచనలు చెయ్యడంఅంటే అశ్రద్ధ రేడియోలూ, పత్రికలూ,పట్టుపట్టి వ్రాయిస్తేతప్ప రచనలు చెయ్యరు (ఈ పనికి వారు పూనుకోవాలనినామనవి)కాని తరచు రచనలుచేస్తే తప్పవీరి బహుభాషా పాండిత్యం తెలుగువారికి ఉపయోగపడకుండా పోయే ప్రమాదంవుంది.—మా.స.

---

(13వ పేజీ తరువాయి)

సమాజతత్వం కొంచెం కూడా అర్థంచేసుకోకుండా వందలకొద్దీ కథలూ, కవితలూ, నాటకాలూ, చిత్రువులూ సృష్టించటం అసాధ్యంకాదు. ముఖ్యంగా పురాణకాలపు సంస్కృతికి పరిమితమై దాన్ని ఎగదోస్తూ కళలు సృష్టించి కొంతమంది వీభూతిపళ్ళచేత బ్రహ్మరధం పట్టించుకోవచ్చు. కాని అసలులో ఉన్న సంస్కృతికి కాలదోషంపట్టిన మనదేశంలాటిదేశాలలో కళాకారుడు తనవిధిని తాను సరిగా నిర్వర్తిస్తే జైలుకుపోవటమో, పోలీసుతుపాకులకు గురికావటమో జరగటం తథ్యం. నలభై, యాభై ఏళ్ళక్రితం జైలుకుపోవటం దేశభక్తుడికి ఎటువంటి సిఫార్సో, ఈనాడు పోలీసు చిఠాలోకిఎక్కి, జైలుకో, తుపాకీగుండుకో ఎర అయ్యే పరిస్థితిలో ఉండటం అలాంటి సిఫార్సుగా కనబడుతుంది.

నిజమైన కళలకు సంధియుగంలో ప్రబలమైన శత్రువులుంటారు. లేకపోతే అవి నిజమైన కళలు కావు.

# చంపాలత

- ఎమ్. ఎస్. సత్యమిత్ర

చాలా ఆలస్యంగా వచ్చిందామె
మూడు పదులు దాటిన లేటు వయసులో
అయితేనేం - మళ్లీ నాకు టీనేజ్ ప్రసాదించింది

ఆలస్యంగా వస్తేనేం ?
రావలసిన తరుణంలోనే వచ్చింది
జీవితంలో రుచి - తరగనారంభించినప్పుడు
ఏ ఎక్సైట్‌మెంట్ యివ్వడం మానేసినప్పుడు
చంపాలతలా వచ్చింది - షాంపేన్‌లా వచ్చింది
మళ్లీ మనసులో దీపాలు వెలిగించింది

# చైతన్య జీవితం

— ఆర్. చంపారాణి

కామం పశుత్వం అంటారు కొందరు
దానికే "శృంగారం" అని ముద్దుపేరుపెట్టి
దివ్యత్వం అంటారు మరికొందరు
కాని - నాకివన్నీ తెలియవు
నేను మాత్రం -
అది చైతన్యవంతమైన జీవలక్షణం అంటాను.

# పుణ్యభూమి

తోడేళ్ళు కాగితాల జీవితాలపై
బరుకు తూన్నప్పుడు
పులులు వేదికలెక్కి
జరీ కండువాలు సవరించుకుంటాయి
నక్కలు గుమ్మాల్లో
పహరాకాచి
బురద జల్లి
తుమ్మముళ్ళు అందిస్తాయి
గాడిదలు ఆహూతుల్లాగా
సిటీబస్సుల్లో స్వారీచేసి
వంగి సలాములతో
పులుల ముందు
గుడ్లప్పగిస్తాయి
కాగితాల జీవితాలు
సభలోకి రాలేవు
వాటిమీద తోడేళ్ళ
బరబరలు వినలేక
పులుల కన్నీళ్లు చూడలేక !
నక్కల రిసెప్షన్ అందుకోలేక !
గాడిదల్లో చేరలేక !

— ఎమ్. వి. వి. సత్యనారాయణ

Source: A.P. Press Academy Website

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/